# బీఆర్ఎస్‌తో అభివృద్ధి, సంక్షేమం


రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

- అభివృద్ధి పనులు కొనసాగాలంటే భూపాల్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవాలి
- మున్సిపల్ పన్నుల తగ్గింపుపై దృష్టి
- అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తాం
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు
- నారాయణఖేడ్ పట్టణంలో రోడ్ షో

నారాయణఖేడ్, నవంబర్ 24 : నారాయణఖేడ్ నియోజక వర్గంలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూపాల్‌రెడ్డి గెలవాలని ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నారాయణఖేడ్‌లో మంత్రి హరీశ్‌రావు రోడ్ షో నిర్వహిచారు. రోడ్‌షోకు వచ్చిన ప్రజలనుద్దేశించి మంత్రి హరీశ్‌రావు ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనలో నారాయణఖేడ్‌లో ప్రభుత్వ దవాఖానలు, విద్యాసంస్థలు మూతపడి ప్రైవేట్ వైద్యశాలలు, కళాశాలలు కొనసాగిన పరిస్థితి ఉండేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానికంగా వంద పడకల దవాఖాన, డయాలసిస్ సెంటర్, డయాగ్నస్టిక్ సెంటర్, మాతాశిశు దవాఖాన, రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించామన్నారు. నాలుగు కొత్త మండలాలను ఏర్పాటు చేయడంతోపాటు నారాయణఖేడ్‌ను మున్సిపాలిటీగా మార్చడమే కాకుండా పట్టణాభివృద్ధికి రూ.50కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేశామని, రూ.110 కోట్లతో తండాల్లో బీటీ రోడ్లు వేయించామని గుర్తు చేశారు. ఇంటింటికీ మంచినీళ్లిచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాలు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులు తీర్చామన్నారు. మున్సిపల్ పన్నులను తగ్గించడంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని తెలిపారు. అసైన్డ్ భూములకు పటా ఇస్తామన్నారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మొద్దని, ఈనెల 30వ తేదీన కారు గుర్తుకు ఓటేసి భూపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి కాంగ్రెసోళ్ల దిమ్మదిరిగేలా చేయాలని ప్రజలకు మంత్రి పిలుపునిచ్చారు.

**ప్రతి నిరుపేదకు కేసీఆర్ బీమా : ఎంపీ బీబీ పాటిల్**

బీఆర్ఎస్ అధికారం చేపట్టిన వెంటనే ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల కేసీఆర్ బీమా అమలు చేస్తామని ఎంపీ బీబీ పాటిల్ తెలిపారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాన్నారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి మహారెడ్డి భూపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**ప్రభుత్వ భూములను కాపాడిన : భూపాల్‌రెడ్డి**

కాంగ్రెస్ నేతలకు చెప్పుకోవడానికి ఏమీ లేకపోవడంతో తనపై భూకబ్జా ఆరోపణలు చేస్తున్నారని, తాను ప్రభుత్వ భూములు కాపాడుతూ కాంగ్రెస్ కబ్జాకోరులకు సింహస్వప్నంగా ఉన్నానని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. పేదల భూములతోపాటు రామాలయం, కాశీనాథ్ మందిర్, వక్ఫ్‌బోర్డు భూములను కాంగ్రెస్ నేతల చెర నుంచి తాను విడిపించానన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని భూపాల్‌రెడ్డి కోరారు.

**కాంగ్రెస్‌ను నమ్మొద్దు : మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి**

ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ ఒప్పంద కుట్రలను నమ్మి ప్రజలు మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయపాల్‌రెడ్డి సూచించారు. ఓటు సంజీవ్‌రెడ్డికి వేసి పనుల కోసం సురేశ్‌షెట్కార్ దగ్గరికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందని ఆరోపించారు. వారు స్వార్థం కోసమే కలిశారని, ప్రజల కోసం కాదనే విషయాన్ని గమనించాలని విజయపాల్‌రెడ్డి సూచించారు.



మంత్రి హరీశ్‌రావు రోడ్‌షో చూడడానికి భవనం ఎక్కిన ప్రజలు


రోడ్‌షోలో భాగంగా ప్రజలకు అభివాదనం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు


మంత్రి హరీశ్‌రావుతో కాట రాజేశ్‌గౌడ్, సునీత దంపతులు


# కాంగ్రెస్ అభ్యర్థికి షాక్

- పటాన్‌చెరు అభ్యర్థి సోదరుడు బీఆర్ఎస్‌లో చేరిక
- మంత్రి హరీశ్‌రావు సమక్షంలో కాట రాజేశ్‌గౌడ్

పటాన్‌చెరు/అమీన్‌పూర్, నవంబర్ 24 : కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు అభ్యర్థి కాట శ్రీనివాస్‌గౌడ్‌కు పెద్దషాక్ తగిలింది. శుక్రవారం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో శ్రీనివాస్‌గౌడ్ సోదరుడు రాజేశ్‌గౌడ్ బీఆర్ఎస్‌లో చేరారు. శ్రీనివాస్‌గౌడ్ సోదరుడు రాజేశ్‌గౌడ్, ఆయన సతీమణి సునీతకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు వారి నిర్ణయాన్ని స్వాగతించారు. బీఆర్ఎస్ పార్టీలో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ ఎక్కువ అన్నారు.

**ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని కలిసిన రాజేశ్‌గౌడ్**

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని కాట రాజేశ్‌గౌడ్ కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రాజేశ్‌గౌడ్ తండ్రి కాట దర్శన్‌గౌడ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రాజేశ్‌గౌడ్ రాకతో బీఆర్ఎస్ పార్టీకి అమీన్‌పూర్ మున్సిపాలిటీలో బలం పెరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో రాజేశ్‌గౌడ్ కుటుంబ సభ్యులు

# మోసం చేసినోడు.. మేలు చేస్తాడా.?

- అన్నావదినను మోసం చేశాడు
- ఎన్నికల్లో గెలిస్తే ప్రజలకు మేలు చేస్తాడా?
- కాంగ్రెస్ అభ్యర్థి కాట శ్రీనివాస్‌గౌడ్‌తో 20 ఏండ్లుగా ఎన్నో ఇబ్బందులు పడ్డాం..
- ఆస్తులు ఉన్నా.. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాను
- మాకు రావాల్సిన ఆస్తిని కూడా అమ్ముకుండు
- రక్షణ కోసం మంత్రి హరీశ్‌రావును ఆశ్రయించాం
- శ్రీనివాస్‌గౌడ్ వదిన కాట సునీతారాజేశ్‌గౌడ్


మాట్లాడుతున్న కాట సునీతారాజేశ్‌గౌడ్ దంపతులు

రామచంద్రాపురం, నవంబర్ 24 : సొంత అన్నావదినను మోసం చేసిన వ్యక్తి.. ప్రజలకు ఏమి మేలు చేస్తాడని? పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాట శ్రీనివాస్‌గౌడ్ వదిన సునీతా రాజేశ్‌గౌడ్ మండిపడ్డారు. హైదరాబాద్‌లో ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు సమక్షంలో కాంగ్రెస్ అభ్యర్థి కాట శ్రీనివాస్‌గౌడ్ సోదరుడు రాజేశ్‌గౌడ్, సునీత దంపతులు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఆర్సీపురం డివిజన్‌లోని సితార గ్రాండ్ హోటల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి కాట శ్రీనివాస్‌గౌడ్ తమను ఏరోజు గౌరవించ లేదన్నారు. 20 ఏండ్లుగా నోరు మూసుకొని బతుకుతున్నామని, ఇంట్లో తమను టార్చర్ పెట్టేవాళ్లని ఆవేదన వ్యక్తం చేశారు. తన మామ దర్శన్‌గౌడ్ పేరు కరాబ్ చేయవద్దనే ఇన్నేండ్లు ఎన్ని అవమానాలు ఎదురైనా భరించామని, ఇక అవమానాలను భరించలేకే బయటకు వచ్చామని పేర్కొన్నారు. పది రోజులుగా తమని బయటకు రాకుండా ఆపుతున్నారని తెలిపారు. కాట శ్రీనివాస్‌గౌడ్ సుధారాణిని ప్రేమ వివాహం చేసుకోవడంతో మా మామ వాళ్లని రెండేండ్లు ఇంటికి రానివ్వలేదన్నారు. శ్రీనివాస్‌గౌడ్ చేసిన పనికి పెద్ద కుమారుడికి పిల్లను ఇవ్వరేమో అనుకుని మేనమామ బిడ్డనైన తనను రాజేశ్‌కి ఇచ్చి వివాహం చేశారని వివరించారు. ఏనాడూ తనకు ఇంట్లో సుఖం లేదని, మా అత్త నన్ను చాలా ఇబ్బంది పెట్టేదని ఆరోపించారు. ఇంట్లో నీళ్లు ఇవ్వకుంటే పక్కింటి వాళ్లను అడిగి నీళ్లు మోసుకొచ్చేదాన్ని అన్నారు. కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నప్పటికీ నేను ప్రైవేట్ ఉద్యోగం చేసుకోవాల్సి వచ్చిందన్నారు. ఎప్పుడు కూడా శ్రీనివాస్‌గౌడ్ అన్నావదినను గౌరవించలేదని, కనీసం నామినేషన్ వేసేటప్పుడు కూడా చెప్పలేదన్నారు. ఇటీవల అమీన్‌పూర్‌లో 14గుంటల భూమిని తమకు తెలియకుండానే అమ్ముకున్నాడని ఆరోపించారు. నా భర్తకు రావాల్సిన ఆస్తిని కాజేస్తున్నాడని తెలిపారు. సుధారాణి మహానటి అని.. భార్యాభర్తలిద్దరూ కలిసి తమను మోసం చేస్తున్నారని, ఆడపడుచులు తమని పట్టించుకోవడం లేదన్నారు. అమీన్‌పూర్ ప్రజలు అతడిని సర్పంచ్‌గా గెలిపిస్తే ఆడదాని ఉసురు తగిలి మూడేండ్లకే పదవిపోయిందని అన్నారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని సమాజానికి తెలిసేలా చేయాలని బయటకు వచ్చినట్లు పేర్కొన్నారు. తమకు రక్షణ కావాలని మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరామన్నారు. బీఆర్ఎస్‌తోనే తమకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రెస్‌మీట్ పెడుతుంటే మమ్మల్ని ఆపేందుకు ప్రయత్నం చేస్తున్నారని, తమకేమైనా జరిగితే శ్రీనివాస్‌గౌడ్‌దే బాధ్యత అని ఆరోపించారు. ప్రతి ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే ఓటేశామని, ఇప్పుడు కూడా ఓటు వేస్తామని కాట సునీతారాజేశ్‌గౌడ్ తెలిపారు.



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు

# పోలింగ్‌ను నిశితంగా పరిశీలించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్
- ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం
- ఎన్నికల పరిశీలకులు దీపక్ సింగ్లా, పవన్ కుమార్, నజీమ్ జైఖాన్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 24 :ఎన్నికల్లో పోలింగ్ అతి కీలకమని, ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని ఎన్నికల సూక్ష్మ పరిశీలకులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ సూచించారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల సూక్ష్మ పరిశీలకులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూక్ష్మ పరిశీలకులు ఎన్నికల సంఘం నిబంధనలను తప్పకుండా అమలు చేయాలని, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్‌కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఉండాలని సూచించారు. పోలింగ్‌కు ముందు రోజు నుంచే పనులు ప్రారంభమవుతాయన్నారు. మాక్ పోలింగ్ నిర్వహించారా? లేదా? అనేది పరిశీలించి, పోలింగ్ ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా జరుగుతుందా? అనే అంశాలను పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో సీక్రెట్ పోలింగ్ కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేశారా?, ఈవీఎంలను ఎలా అమరుస్తున్నారు? అనేవి చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ముగిసే వరకు ప్రతి అంశాన్ని సాధారణ పరిశీలకులకు నివేదించాలని సూచించారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై, సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు. 5 గంటల లోపు పోలింగ్ కేంద్రంలోకి వచ్చిన ఓటర్లతో పోలింగ్ జరపాలని సూచించారు. అన్ని అంశాలను సూక్ష్మ పరిశీలకులు విధిగా పరిశీలించాలన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక దృష్టిని సారించాలని, పోలింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లోనూ జరిగే సంఘటనలను గమనిస్తూ జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. నారాయణఖేడ్, అందోల్ నియోజకవర్గాల ఎన్నిక ల సాధారణ పరిశీలకులు దీపక్ సింగ్లా, పవన్ కుమార్, నజీమ్ జైఖాన్ సూక్ష్మ పరిశీలకులకు పలు సూచనలు చేశారు. ముందుగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సూక్ష్మ పరిశీలకుల విధులు, బాధ్యతలపై మాస్టర్ ట్రైనర్లు వివరించారు. సమావేశంలో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు, డీఆర్వో నగేశ్, మాస్టర్ ట్రైనర్లు, సూక్ష్మ పరిశీలకులు పాల్గొన్నారు.